క్లుప్తంగా

విద్యుత్ భవన్‌లో ఎంపికలు నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వివిధ పోటీలకు విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మహిళల ఎంపికలను విద్యుత్ భవన్‌లో గురువారం నిర్వహించనున్నామని ఎస్పీడీసీఎల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామివేలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో ఉత్తర్వుల మేరకు 2024 – 25 స్పోర్ట్స్ క్యాలెండర్ ప్రకారం ఇంటర్ సర్కిల్లో మహిళలకు క్రీడా పోటీలు, కల్చరల్ ప్రోగ్రామ్స్‌ను గుంటూరులో ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నారని చెప్పారు. ఆసక్తి గల మహిళా ఉద్యోగులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ – 2 ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. వివరాలకు 90308 02038, 95536 51841 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బైక్‌ల ఢీ: ఒకరి మృతి

నెల్లూరు సిటీ: బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన జొన్నవాడ మలుపు వద్ద సబ్‌స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. ఆత్మకూరుకు చెందిన మస్తాన్ (35)నరసింహకొండ సమీపంలోని ఐఎమ్మెల్ డిపోలో హమాలీగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో పనిముగించుకొని ఆత్మకూరుకు బైక్‌పై బయల్దేరారు. ఈ తరుణంలో జొన్నవాడ మలుపు వద్ద సబ్‌స్టేషన్ సమీపంలో బుచ్చిరెడ్డిపాళెం వైపు నుంచి బైక్.. ఇది ఢీకొన్నాయి. మస్తాన్ తలకు తీవ్రగాయం కావడంతో రక్తస్రావమైంది. ఆస్పత్రికి స్థానికులు తరలిస్తుండగా, మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఘటన స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

డాక్టరేట్ ప్రదానం



దుర్గాప్రసాద్‌రావు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగంలో వర్బల్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రెయినర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దుర్గాప్రసాద్‌కు డాక్టరేట్ లభించింది. జేమ్స్ బోల్డ్ విన్ నావల్స్ ఏ స్టడీ ఇన్ థిమాటిక్ కన్సరన్స్ అనే అంశంపై వెంకటేశ్వర యూనివర్సిటీలో ప్రొఫెసర్ రవినాయక్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను వర్సిటీ ప్రదానం చేసింది.

సీసీ కెమెరాల ప్రారంభం



నెల్లూరు సిటీ: ధనలక్ష్మీపురం, నాలుగో మైలు జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రూరల్ సీఐ వేణు బుధవారం ప్రారంభించారు. ఎస్సై లక్ష్మణ్‌రావు, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, మోపూరు భాస్కర్‌నాయుడు, అల్తూరి మస్తానయ్య, పవన్‌కుమార్‌రెడ్డి, దుర్గంపాటి రవికుమార్, ఉప్పల ఈశ్వరయ్య, రాజగోపాల్‌రెడ్డి, ఆల్తూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

నెల్లూరు సిటీ: మద్రాస్ బస్టాండ్ సమీపంలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ప్రధాన కార్యాలయంలో కొనుగోలు, విక్రయదారులు దళారులను నమ్మి మోసపోవద్దని సబ్ రిజిస్ట్రార్ – 1 విజయరాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయని చెప్పారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా తనను సంప్రదించాలని కోరారు. కార్యాలయ సమీపంలో దళారుల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

• డీఎంహెచ్‌ఓ సుజాత



మాట్లాడుతున్న సుజాత

నెల్లూరు(అర్బన్): పిల్లలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు చేపట్టడంతో పాటు పోలీసు కేసులు తప్పవని డీఎంహెచ్‌ఓ సుజాత హెచ్చరించారు. బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలనే అంశంపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, విద్యా, వైద్య ఆరోగ్య శాఖల అధికారులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో బాలికలు ఎక్కువగా లైంగిక వేధింపులకు గురికావడం బాధాకరమని చెప్పారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. వేధింపులకు గురైన బాధితులకు అండగా ఉండాలని, వారికి ధైర్యం చెప్పి విశ్వాసాన్ని పెంచాలని సూచించారు.
బాధితులకు బాలల హక్కుల సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, ఎన్సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్, రాష్ట్ర ట్రెయినర్ సుప్రజాదేవి, డీఈఐసీ మేనేజర్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

• బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీసీ సంక్షేమ శాఖకు చెందిన వసతి గృహాల్లో ఉంటున్న పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ పేర్కొన్నారు. నగరంలోని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 49 హాస్టళ్లలో పదో తరగతి విద్యార్థులు 551 మంది (బాలికలు 241, బాలురు 310) ఉన్నారన్నారు. వీరి కోసం ప్రత్యేకంగా ట్యూటర్లను ఏర్పాటు చేశామన్నారు. పౌష్టికాహారాన్ని రాత్రి వేళ అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించామన్నారు. ఏ గ్రూప్‌లో 200 మంది, బీ గ్రూపులో 226 మంది, సీ గ్రూప్‌లో 125 మంది ఉన్నారన్నారు. సీ గ్రూప్‌లో ఉన్నవారిని ట్యూటర్లు ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నారని వివరించారు. ప్రతి హాస్టల్లో ఫేస్ రికగ్నిషన్ హాజరు వేయిస్తున్నామని, నూరు శాతం మేర రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. ప్రస్తుతం 85 శాతం హాజరు పడుతోందని చెప్పారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు.

'ఐ లవ్ నెల్లూరు'ను విస్తృతంగా తీసుకెళ్దాం



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(బారకాసు): ఐ లవ్ నెల్లూరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్దామని, దీనికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. అయ్యప్పగుడి సమీపంలోని నుడా కార్యాలయంలో గల తన చాంబర్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. నెక్లెస్ రోడ్డులో ఐ లవ్ నెల్లూరు బోర్డును ఏర్పాటు చేశామని చెప్పారు. అన్ని దుకాణాలు, షాపింగ్ మాళ్లు తదితరాల వద్ద ఈ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఎంఐజీ లేఅవుట్లలో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. సిటీ ప్లానర్ హిమబిందు, ఏఓ రాజు పాల్గొన్నారు.

వేడుకగా ఏకాంతసేవ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏకాంతసేవను జరిపారు. అభిషేకాలు, పూజలు, అర్చనలను నిర్వహించారు. ఉభయకర్తలుగా కృష్ణారావు, పద్మావతి దంపతులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెస్సెమ్‌ఈ సర్వేపై అవగాహన కల్పించాలి



సమావేశానికి హాజరైన అధికారులు

నెల్లూరు(బారకాసు): ఎమ్మెస్సెమ్‌ఈలను గుర్తించి వాటి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేలో నగరంలోని అన్ని పరిశ్రమల వివరాలను నమోదు చేసేందుకు గానూ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని అదనపు కమిషనర్ నందన్ సూచించారు. ఏకేనగర్‌లోని జిల్లా పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ అధికారులతో బుధవారం సమావేశమైన ఆయన మాట్లాడారు. ఆటోనగర్ ఉడ్ కాంప్లెక్స్, ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను గుర్తించి వాటి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఐఎల్వో కమిషనర్ బ్రహ్మయ్య, పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి కేంద్ర జిల్లా జీఎం మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



మాట్లాడుతున్న నాగమోహన్

నెల్లూరు సిటీ: రూరల్ మండల పరిధిలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని మండల వ్యవసాయాధికారి నాగమోహన్ పేర్కొన్నారు. దొంతాలి, పెద్దచెరుకూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. సౌత్‌మోపూరు, కాకుపల్లి, మాదరాజుగూడూరు, పెద్ద చెరుకూరులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. మండలంలోని ఆమంచర్ల, కొండ్లపూడిలో కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను పంపామన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పలు అంశాలపై వీరు చర్చించారు.

డీకేడబ్ల్యూలో చిత్రకళా పోటీలు



నెల్లూరు (టౌన్): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని లింగ సమానత్వం అనే అంశంపై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు చిత్రకళా పోటీలను పోలీస్ శాఖ సహకారంతో బుధవారం నిర్వహించారు. మొదటి మూడు స్థానాలను విష్ణుప్రియ, లావణ్య, కృష్ణాంజలి సాధించారు. ప్రిన్సిపల్ గిరి, కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ కమిటీ కన్వీనర్ విజయకళ, మెంటార్లు కళాప్రియ, తమన్నా, లలితకుమారి, గీత, దివ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయోపరిమితి పెంపుపై హర్షం

నెల్లూరు రూరల్: ఆశ వర్కర్ల ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ హర్షం వ్యక్తం చేశారు. 47వ వార్డు సచివాలయానికి సంబంధించిన ఆశ వర్కర్లతో కలిసి కృతజ్ఞతలను బుధవారం తెలియజేశారు. నేతలు హేమంత్‌కుమార్, సుందరం, శ్రీనివాసులు, సత్యరమేష్, మధు, తేజ, సాయి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల సమన్వయ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న వంశీకృష్ణ

నెల్లూరు(బృందావనం): అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఆర్డీఓ వంశీకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని రంగడి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను ఈ నెల తొమ్మిది నుంచి 20 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. నగర డీఎస్పీ సింధుప్రియ, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపర్చుకోండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ అధికారులు తమ పనితీరును మెరుగుపర్చుకొని వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ విజయన్ సూచించారు. విద్యుత్ భవన్‌లోని తన చాంబర్ నుంచి బుధవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వేసవిలో ఎలాంటి అంతరాయాల్లేకుండా విద్యుత్‌ను అందించాలని సూచించారు. సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్తంభాలకు అల్లుకొని ఉన్న తీగలు, అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించాలని ఆదేశించారు.

ఫీవర్ సర్వే పరిశీలన



నెల్లూరు(అర్బన్): చాకలివీధి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని లీలామహల్ వీధి, మహలక్ష్మమ్మ గుడి తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను జిల్లా మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు బుధవారం పరిశీలించారు. ఇంటింటి సర్వే, పీడీపీ వర్క్, ఇండోర్ స్ప్రేయింగ్‌ను పర్యవేక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. చికున్ గున్యా అనుమానిత కేసు ఇక్కడ నమోదైందని, ఈ తరుణంలో దోమల లార్వాలను సేకరించి ల్యాబ్‌లలో పరీక్షించనున్నామని చెప్పారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు.

రోగులు కోలుకునేందుకు పునరావాస కేంద్రం



ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(అర్బన్): ఆస్పత్రిలో చేరిన రోగులు చికిత్స అనంతరం సత్వరం కోలుకునేలా పునరావాస కేంద్రాన్ని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. దీన్ని అక్కడి డాక్టర్లతో కలిసి ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సెంటర్ హెడ్ ధీరజ్‌రెడ్డి మాట్లాడారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో పాటు పౌష్టికాహారం, ప్రత్యేక పర్యవేక్షణతో వైద్యులు, వైద్య పరికరాలతో సేవలందించనున్నామని వివరించారు. మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ బిందురెడ్డి, హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ యశ్వంత్‌రెడ్డి, నర్సింగ్ హెడ్ శైలజ, మార్కెటింగ్ హెడ్ సతీష్, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

సోఫా చైర్ల అందజేత



నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం 15 సోఫా చైర్లను భగవాన్ మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బుధవారం అందజేశారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, డిపో మేనేజర్లు మురళీకృష్ణ, శివకేశవ్‌యాదవ్ పాల్గొన్నారు.

8న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సమావేశం

నెల్లూరు(బృందావనం): కరెంటాఫీస్ సెంటర్ సమీపంలోని వెంకటేశ్వర విద్యాలయంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సమావేశాన్ని శనివారం సాయంత్రం నిర్వహించనున్నామని అభ్యుదయ రచయితల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు పెరుగు రామకృష్ణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగిశెట్టి శివకుమార్, కరుణశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీవేత్తలు, కవులు, రచయితలు హాజరుకావాలని కోరారు.

కసుమూరులో దంపతులపై దాడి

వెంకటాచలం : పాతకక్షల నేపథ్యంలో మండలంలోని కసుమూరు గ్రామానికి చెందిన పిల్లి దశయ్య, సుప్రియ దంపతులపై అదే గ్రామానికి చెందిన ఖాదర్‌మస్తాన్ అనే వ్యక్తి దాడి చేశాడు. బాధితుల వివరాల మేరకు.. ఈనెల 2వ తేదీన కసుమూరు గ్రామంలోని తన నివాసంలో సుప్రియ ఒంటరిగా ఉండగా అదే సమయంలో ఖాదర్‌బాషా ప్రవేశించి దాడి చేశాడు. ఆ సమయంలో ఇంటికి వచ్చిన ఆమె భర్తపై కూడా దాడి చేయడంతో బాధితులు వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రైల్లోంచి పడి వ్యక్తి మృతి

కొడవలూరు : రైల్లో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కొడవలూరు, తలమంచి రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం చోటుచేసుకుంది. మృతుడికి 30–35 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, నలుపు, తెలుపు చెక్స్ కలిగిన చొక్కా ధరించి ఉన్నాడని రైల్వే ఎస్సై అరుణ తెలిపారు. ఏ రైలు నుంచి పడ్డారన్న విషయం తెలియరాలేదన్నారు. మృతుడ్ని గుర్తిస్తే 94406 27648 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న శైలేంద్రకుమార్

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పలు సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలను ఎంపీడీఓ శైలేంద్రకుమార్ బుధవారం చేపట్టారు. వెల్లంటి, సౌత్‌మోపూరు, ములుమూడి సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ సర్వేలకు సంబంధించి ఉద్యోగుల విధులను అడిగి తెలుసుకున్నారు. సర్వేల్లో నూరు శాతం పురోగతి సాధించాలని సూచించారు.